# క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి చర్యలు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**విద్యార్థుల రెగ్యులర్ హాజరు, కనీస విద్యా ప్రమాణాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**మంథని పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలి**
**పాత సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**



**అగ్నిధార న్యూస్ మంథని :**

క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంథని ప్రాంతంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం విస్తృతంగా పర్యటించారు. మంథని మండలం మండలం కన్నాల గ్రామంలోని వ్యవసాయ భూములను, అడవి సోమనపల్లిలో నిర్మాణం అవుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను, సోమనపల్లి లోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మంథని మున్సిపల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ...**

సింగరేణి నీటి కారణంగా తమ వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించామని, ఇప్పటివరకు ఎలాంటి పెద్దస్థాయి ముంపు జరగలేదని తెలిపారు. భవిష్యత్తులో కూడా సింగరేణి నీటి వల్ల వ్యవసాయ భూములు ముంపునకు గురికాకుండా అవసరమైన ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రారంభించేలా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల పురోగతికి సంబంధించి నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, సమస్యలను పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి కనీస విద్యా ప్రమాణాలను సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులకు అవసరమైన వాహనాలు, ఇతర సౌకర్యాల కోసం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. పాత సీసీ రోడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీల నిర్మాణం, అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, మౌలిక వసతుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కేలుస్కర్ చూపిన మార్గం.. పేద విద్యార్థికి పుస్తకమే భవిష్యత్ బాట

**సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్ ,( రామగుండం):**

పేద విద్యార్థులను ప్రోత్సహించి వారి చేతుల్లో పుస్తకాలు పెట్టడమే సమాజ భవిష్యత్తుకు బాటలు వేయడమని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ అన్నారు. కృష్ణాజీ అర్జున్ కేలుస్కర్ 166వ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు.

డా. బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితంలో కేలుస్కర్ పాత్ర చిరస్మరణీయమని అన్నారు. 1907లో అంబేద్కర్ మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులైన సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో కేలుస్కర్.. తాను రచించిన భగవాన్ బుద్ధుని జీవిత చరిత్ర పుస్తకాన్ని యువ భీమ్రావ్‌కు అందించారని గుర్తుచేశారు. ఆ పుస్తకం తనపై ప్రభావం చూపిందని అంబేద్కర్ స్వయంగా పేర్కొన్నారని తెలిపారు. బుద్ధుని ఆలోచనల వైపు అంబేద్కర్ దృష్టి మళ్లడానికి ఆ పుస్తకం ఒక ముఖ్యమైన ప్రారంభ పరిచయంగా నిలిచిందన్నారు.

అయితే అంబేద్కర్ బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించడం కేవలం ఒక్క పుస్తకం ప్రభావంతో జరిగిందని చెప్పడం సరికాదని నగేష్ స్పష్టం చేశారు. దశాబ్దాలపాటు బుద్ధుని బోధనలు, వివిధ మతాలు, సామాజిక వ్యవస్థలను అధ్యయనం చేసి, లోతుగా పరిశీలించిన అనంతరం 1956లో బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించారని తెలిపారు.

**ప్రతిభను గుర్తించిన కేలుస్కర్**

అంబేద్కర్ ఉన్నత విద్యకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ఆయన ప్రతిభను గుర్తించిన కేలుస్కర్ బరోడా మహారాజు సయాజీరావు గైక్వాడ్ దృష్టికి తీసుకెళ్లారని నగేష్ పేర్కొన్నారు. అనంతరం మహారాజు అంబేద్కర్‌కు స్కాలర్‌షిప్ అందించి విద్యాభ్యాసానికి తోడ్పడ్డారని తెలిపారు. స్కాలర్‌షిప్ ఇచ్చింది మహారాజే అయినప్పటికీ, ఆ సహాయం అందేలా కేలుస్కర్ చేసిన ప్రయత్నాన్ని విస్మరించరాదన్నారు. పేద విద్యార్థిపై జాలి చూపడం కంటే అతడికి విద్యా అవకాశాన్ని కల్పించడమే అసలైన సహాయమని అన్నారు. పుస్తకం, విద్య, సరైన మార్గదర్శకత్వం అందితే ఒక విద్యార్థి తన జీవితాన్ని తానే మార్చుకునే శక్తిని పొందుతాడని పేర్కొన్నారు.

**మహనీయులను కులాలకు పరిమితం చేయొద్దు**

మహనీయులను కులాల వారీగా విభజించడం సరికాదని డా. నగేష్ అన్నారు. అంబేద్కర్, బుద్ధుడు, పూలే, పెరియార్, కేలుస్కర్ వంటి మహనీయులు కులపు గోడల్లో బంధించేందుకు పుట్టలేదని, సామాజిక అసమానతలను ప్రశ్నించి ప్రజలను చైతన్యపరిచేందుకు కృషి చేశారని తెలిపారు. వారి పేర్లను స్మరించడంతో పాటు వారి ఆలోచనలను అధ్యయనం చేసి ఆచరణలో పెట్టాలని సూచించారు.

**ప్రతి పేద విద్యార్థిలో ఓ భీమ్రావ్‌ను చూడాలి**

కేలుస్కర్ జయంతిని కేవలం పూలమాలలకే పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని నగేష్ పిలుపునిచ్చారు. చదువుకోలేని పేద విద్యార్థులను గుర్తించి పుస్తకాలు అందించాలని, ఫీజులు చెల్లించలేని వారికి అండగా నిలవాలని, ప్రతిభావంతులకు ఉన్నత విద్య, పోటీ పరీక్షల దిశగా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. "కేలుస్కర్ అంబేద్కర్ చేతిలో పుస్తకం పెట్టారు.. మన చుట్టూ ఉన్న పేద విద్యార్థుల చేతుల్లో మనం ఏమి పెడుతున్నాం?" అని ప్రశ్నించారు. ఒక పుస్తకం ఒక జీవితాన్ని మార్చగలదని, ఒక విద్యార్థికి అందించిన అవకాశం భవిష్యత్తులో సమాజాన్నే మార్చగలదని అన్నారు. అంబేద్కర్ మహోన్నత స్థాయికి ఎదగడానికి ఆయన స్వీయ కృషి, పట్టుదలే ప్రధాన కారణాలని, అయితే ఆయన ప్రయాణంలో కేలుస్కర్ వంటి వ్యక్తులు అందించిన ప్రోత్సాహాన్ని చరిత్ర గుర్తుంచుకోవాలని తెలిపారు. కేలుస్కర్‌కు నిజమైన నివాళి అంటే మరో పేద విద్యార్థిని గుర్తించి అతని చేతిలో పుస్తకం పెట్టి, చదువుకు అండగా నిలవడమేనని డా. మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు.

# ప్రజల సౌకర్యాల కోసం నిరంతరం పోరాటం

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి) :**

ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. లోక్‌సభ నిర్వహణ ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ బీజేపీ స్పీకర్‌గా కాకుండా లోక్‌సభ స్పీకర్‌గా వ్యవహరించాలని కోరారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభ స్తంభించడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని పేర్కొన్నారు.

**విద్యార్థుల హక్కుల కోసం గళం**

తమ భవిష్యత్తు, హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవడం సరికాదని వంశీకృష్ణ అన్నారు. విద్యార్థుల గొంతును అణచివేయడం సమస్యకు పరిష్కారం కాదని, వారి హక్కుల కోసం పోరాడతామని స్పష్టం చేశారు.

**బీజేపీని వ్యతిరేకించడం దేశద్రోహం కాదు**

రాజకీయ భిన్నాభిప్రాయాలను దేశద్రోహంతో ముడిపెట్టడం సరికాదని ఎంపీ అన్నారు. బీజేపీని వ్యతిరేకించడం దేశాన్ని వ్యతిరేకించడం కాదని, ప్రతి భారతీయుడికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉందన్నారు.

**రామమందిర నిధులపై స్పష్టత ఇవ్వాలి**

రామమందిర అంశాన్ని ఎన్నికల రాజకీయాలకు ఉపయోగించుకున్నారని ఆరోపించిన వంశీకృష్ణ.. ఆలయానికి సంబంధించిన నిధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిధుల వినియోగంపై అవకతవకల ఆరోపణలు వస్తే బాధ్యత ఎవరిదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రజల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు, పారదర్శక పాలన కోసం తన పోరాటం కొనసాగుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# నిరుపేద యువతి వివాహానికి రూ.11 వేల సాయం

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

తండ్రి లేని నిరుపేద గంగపుత్ర కుటుంబానికి చెందిన కల్లెడ దివ్య వివాహానికి గంగపుత్ర సంఘాల నాయకుడు ఎర్రబోయిన శశాంక్ ఆర్థిక చేయూత అందించారు. ఆగస్టు 26న దివ్య వివాహం జరగనున్న నేపథ్యంలో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఆయన రూ.11 వేల ఆర్థిక సాయం అందజేశారు. రామగుండానికి చెందిన కల్లెడ దివ్య తండ్రి లేకపోవడంతో వివాహ ఖర్చుల భారం కుటుంబంపై పడింది. ఈ విషయాన్ని స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు తెలియజేయడంతో స్పందించిన తెలంగాణ రాష్ట్రీయ గంగపుత్ర యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రబోయిన శశాంక్ వివాహానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా దివ్య తల్లి కల్లెడ స్వరూప, తమ కుటుంబానికి అండగా నిలిచిన ఎర్రబోయిన శశాంక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు గోలివాడ చంద్రకళ గంగపుత్ర, ఐత శివకుమార్, తెలంగాణ రాష్ట్రీయ గంగపుత్ర యువజన సంఘం నాయకులు కలిశెట్టి చంద్రకాంత్, పద్మి ప్రశాంత్, పల్లికొండ రాజేష్, కల్లెడ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



## రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా పండ్ల పంపిణీ



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ దేశ అభివృద్ధికి, ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు కాంగ్రెస్ శ్రేణులు అంకితమై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు రంగు సత్యనారాయణ గౌడ్, గుమ్మడి శ్రీనివాస్, బొంగోని సదయ్య,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెబల్ రాజ్ కుమార మాజీ ఎంపీటీసీ లు శేవ్వా శంకరయ్య,పిల్లి చంద్ర శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెన్ రెడ్డి కిషన్ రెడ్డి, మల్యాల మహేష్ గౌడ్, మహమ్మద్ యూసుఫ్ (లల్లు)ఉప సర్పంచ్ రాజమహేందర్, నగునూరి నర్సయ్య గౌడ్, చిగురు రవీందర్, ఇనగంటి శ్రావణ్ కుమార్ చాట్ల గట్టయ్య,మేడగొని విజయ్, చాట్ల రాయమల్లు, కాడిపల్లి సుమన్, కోలేటి సురేష్, కొంతం శ్రీనివాస్, పచ్చునురి రాజకుమార్, బోనాల పవన్, వెంగళి రాజయ్య,గర్రెపల్లి వెంకన్న, దాసరి రామస్వామి, మల్యాల చిన్న తిరుపతి, బత్తిని శ్రీనివాస్, బొంగుని వీరయ్య, బంగారి శ్రీనివాస్, ఆరేల్లి శ్రీనివాస్ లు తదితరులు పాల్గొన్నారు

## 'కల్పిత నాయకుడు' ఆధారాలను పరిశీలించాలి




**ఎస్సీ కమిషన్ జోక్యం చేసుకోవాలి: డా. మార్షల్ దుర్గం నాగేష్**

**అగ్నిధార న్యూస్,(హైదరాబాద్) :**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై తీవ్ర ఆరోపణలతో రచించిన 'కల్పిత నాయకుడు--ది ఫాల్స్ లీడర్' పుస్తకంలోని ఆధారాలను విడుదలకు ముందే నిపుణులతో పరిశీలించాలని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నాగేష్ డిమాండ్ చేశారు. పుస్తక రచయిత హమారా ప్రసాద్ పేర్కొన్న అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు, ఇతర ఆధారాలు ఆయన చేస్తున్న ఆరోపణలకు నిజంగా మద్దతు ఇస్తున్నాయా? లేదా? తేల్చాలని కోరారు. ఈ నెల 20న సమతా సైనిక్ దళ్ తెలంగాణ శాఖ తరఫున జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో పాటు తెలంగాణలోని సంబంధిత అధికారులకు వినతిపత్రం పంపినట్లు నాగేష్ తెలిపారు. పుస్తకంలోని మూల పత్రాలు, సూచనలు, అంబేద్కర్ రచనల సంపుటాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. అంబేద్కర్‌పై విమర్శలకు తాము వ్యతిరేకం కాదని, అయితే చారిత్రక అంశాలను సందర్భరహితంగా ఉటంకించి వక్రీకరించడం సరికాదని నాగేష్ స్పష్టం చేశారు. "పుస్తకాన్ని నిషేధించాలన్నది మా డిమాండ్ కాదు.. అందులో పేర్కొన్న ఆధారాలను పరిశీలించాలన్నదే మా విజ్ఞప్తి. వాస్తవం ఉంటే ప్రజల ముందుకు రావాలి.. తప్పుదారి పట్టించే అంశాలుంటే ఆధారాలతోనే వెల్లడించాలి" అని అన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ తక్షణమే స్పందించి రచయిత నుంచి వివరణ కోరడంతో పాటు అవసరమైతే నిపుణుల కమిటీతో పుస్తకంలోని చారిత్రక ఆధారాలను పరిశీలించాలని డా. మార్షల్ దుర్గం నాగేష్ డిమాండ్ చేశారు.

## మాల సంఘం యువజన విభాగం కమిటీ నియామకం

**అగ్నిధార న్యూస్,(రామగుండం) :**

మాల సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో యువజన విభాగం కమిటీని నియమించారు. రామగుండం యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా పసరగొండ రామ్, సంయుక్త కార్యదర్శులుగా దాసరి శ్రావణ్‌కుమార్, బైరందిలీప్‌కుమార్‌లను నియమించారు. మాల సంఘం ఉపాధ్యక్షుడిగా కుంభాల రామరాజును నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గ మాల సంఘం అధ్యక్షుడు మాలే మధు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మాల సంఘం అధ్యక్షుడు సోగాల వెంకటి, ప్రధాన కార్యదర్శి మర్రి ఐలయ్య, 38వ డివిజన్ కార్పొరేటర్ నెలకంటి రాము, సీనియర్ నాయకుడు దేవ వెంకటేశం, ఉపాధ్యక్షుడు దాసరి రామస్వామి తదితరులు నూతన కమిటీ సభ్యులను అభినందించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువతను సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని నాయకులు సూచించారు. మాల సంఘం అభివృద్ధి, యువత సమస్యల పరిష్కారం, సామాజిక చైతన్యం కోసం నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జర్నలిస్టు బైరంసతీష్, సలహాదారులు పిట్టల వెంకట, నంది నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి కడమండ శ్రీహరి, సంయుక్త కార్యదర్శులు నూకల మొండి, అందుగుల లింగయ్య, యువజన ఉపాధ్యక్షుడు న్యా శెట్టి యుగంధర్, కోఆర్డినేటర్ నంది నరేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కనుమల్ల సంపత్, కందుగుల రాజు, పొనగంటి రాజయ్య, పెద్దలు బొమ్మక రాయలింగు, ఎరుకల లింగమూర్తి, టీం సభ్యులు పరుస వినేష్, రాజారపు రాజమల్లు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా అబ్దుల్ కరీం

**అగ్నిధార న్యూస్ , (రామగుండం):**

ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సభ్యునిగా అబ్దుల్ కరీం ఎన్నికయ్యారు. గురువారం సుల్తానాబాద్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ నాలుగో జిల్లా మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహాసభ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ కార్మిక వర్గం ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలు, హక్కులు, ఉద్యోగ భద్రత, ఉపాధి హామీ కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అబ్దుల్ కరీం జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అబ్దుల్ కరీం నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు.

